క్లుప్తంగా

గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనునాయక్



చిలకలూరిపేట: ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య (ఏపీజీఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం సమాఖ్య అధ్యక్షుడు కారం ధారయ్య అధ్యక్షతన విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా చిలకలూరిపేట పట్టణానికి చెందిన గిరిజన నాయకుడు బి.శ్రీను నాయక్‌ను సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎంపిక చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీను నాయక్‌ను పలువురు ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

పొగాకు పంట సాగు చేయవద్దు

నూజెండ్ల: రైతులు పొగాకు పంట సాగు చేయరాదని మండల వ్యవసాయ అధికారి ఆంజనేయ నాయక్ కోరారు. సోమవారం మండలంలోని చింతలచెర్వు గ్రామంలో పొగాకు సాగుపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అనుగుణంగా జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు పొగాకు పంటను రైతులు సాగు చేయరాదన్నారు. గత ఏడాది పొగాకు సాగు చేసిన రైతులు కొనుగోలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ప్రవేటు కంపెనీ వారు దళారులు మోసపూరిత మాటల నమ్మి పొగాకు సాగు చేయరాదన్నారు. పొగాకు పంట సాగు చేయటం వలన ఆర్థికంగా రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వ నిబంధనలు రైతులు పాటించటం ద్వారా ఆర్థిక ఇబ్బందుల నుంచి అధిగమించవచ్చునన్నారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వరిపంట సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసిక్తి చూపాలన్నారు. అయిల్ ఫాం, డ్రాగన్, మామిడి, తదితర పండ్ల తోటలు సాగు చేయటం ద్వారా ప్రభుత్వ పరంగా రాయితీ కూడా వస్తుందన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి



యడ్లపాడు: పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికులకు పనిప్రదేశాల్లో రక్షణ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనని సీడీపీవో జి.శాంతకుమారి తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వంకాయలపాడులోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీలో మిషన్ సంకల్ప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ గురించి వివరించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే సమాచారం తెలపాలన్నారు. గృహహింస, మహిళలకు రక్షణ చట్టాల గురించి వివరించారు. ఎం.సంగీత, కె.వాణిశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశాలను పరిశీలించిన డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో



మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పద్మావతి సోమవారం పరిశీలించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిబంధనలకు అనుగుణంగా పారిశ్యుద్ధ్య నిర్వహణను పాటిస్తున్నారా లేదా అనే విషయంపై పరిశీలించారు. ప్రస్తుత తరుణంలో వైద్యశాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల ఆరోగ్యం తెలుసుకునే పనిలో ఆశాలు ఉన్నారన్నారు. ఆరోగ్య విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చినా అక్కడికక్కడే రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైతే వైద్యశాల డాక్టర్‌లు కూడా జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వైద్యాన్ని కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పి. జగన్ నరసింహా రెడ్డి, డాక్టర్ ఎన్. సాయిబాబాలు పాల్గొన్నారు.

పల్లెకు జ్వరమొచ్చింది!



బొల్లాపల్లి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



ఘాటి తండాలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి గ్రామాన ఇంటింటా ఒకరిద్దరు మంచం పట్టారు. వైద్య సేవలు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. ఘాటు తండాకు చెందిన ఒకరు జిల్లా వైద్యాధికారి ఫిర్యాదు చేయడంతో, వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఘాటి తండాలో సోమవారం పి.హెచ్.సి వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించడంతో,సీజనల్ వ్యాధులు ప్రబలాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు అంటున్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని పారిశుధ్య చర్యలు చేపట్టాలని దోమల ద్వారా పూర్తిగ అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాచి వడ పోసిన నీటిని తాగాలని వైద్యులు సూచించారు. సాధారణ జ్వరాలు మలేరియా, టైఫాయిడ్, చికున్‌గునియా, డెంగ్యూ అంటే వ్యాధులకు దారి తీసే అవకాశం ఉందని, ప్రజలుతగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్పున్నారు. ప్రతి గ్రామంలో ఆయా పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు వైద్య బృందం వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు అందజేయాలని ప్రజలు ప్రజలు అంటున్నారు.

–బొల్లాపల్లి

ఆక్రమణల తొలగింపు షురూ

- సర్వే నిర్వహించి హద్దుల నిర్ధారణ
- సైడు కాల్వలు, కల్వర్టుల నిర్మాణానికి సన్నాహాలు



గణపవరంలో రోడ్డు కొలతలు వేస్తున్న సర్వే, పంచాయతీ సిబ్బంది

నాదెండ్ల: గణపవరం ఆటో సెంటర్ నుండి కుప్పగంజివాగు వరకూ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను పంచాయతీ అధికారులు తొలగిస్తున్న విషయం విదితమే. సోమవారం గ్రామసర్వేయర్లు షేక్ ఆషీక్, బి మోహిని, పంచాయతీ కార్యదర్శులు మారుతి బాబు, నీరజ, జానీ, మహమ్మద్ ఖాశిం, వీఆర్వో అంకమ్మరావు రోడ్డుకు ఇరువైపులా సర్వే నిర్వహించి కొలతలు వేసి హద్దులు నిర్ధారించారు. ఈ హద్దులకు అనుగుణంగా రెండు వైపులా సైడు కాల్వలు, కల్వర్టులు నిర్మించనున్నారు. ఆయా పనులకు గాను రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. త్వరలో ఆక్రమణలు తొలగింపు పూర్తవగానే సర్వే ప్రకారం పనులు ప్రారంభించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు తెలిపారు. రోడ్డు ఆక్రమణలకు గురికావటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటం, స్కూలు బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలకు అంతరాయం కలగటంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి.

ఈ నేపథ్యంలో ఆక్రమణలను పూర్తిగా తొలగింపు ప్రారంభించారు. ఆక్రమణలు పూర్తయిన అనంతరం గణపవరం–నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డు ఆక్రమణలు సైతం తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు తెలిపారు.

13న జాతీయ లోక్ అదాలత్



వినుకొండ : జాతీయ, ఆంధ్రప్రదేశ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ ప్రకటనలో తెలిపారు. సివిల్ కేసులు, చెక్ బౌన్స్, కేసులు, బ్యాంక్ కేసులు, మనోవర్తి కేసులు, కుటుంబ వివాద కేసులు, రాజీ చేసుకోదలచిన కేసులను ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో విజయవాడ వాసి మృతి



శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో విజయవాడ వాసి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. విజయవాడ చిట్టినగర్‌కు చెందిన తమ్మిన ప్రసాదు, కొలుసు అశోక్‌లు స్కూటీపై శ్రీశైలంలో దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అయితే వీరు ప్రయాణిస్తున్న వాహనం గంటావారిపాలెం స్పీడు బ్రేకరు వద్ద అదుపుతప్పి పడిపోయింది. వాహనం నడుపుతున్న ప్రసాదు (33) రోడ్డుపై పడిపోవడం.. ఇదే క్రమంలో పక్కనే వస్తున్న టిప్పర్ రావడంతో సంఘటన స్థలంలో మృతి చెందాడు. స్కూటీపై వస్తున్న మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వైద్యశాలకు తరలించారు. ఇద్దరు స్నేహితులు కావటం కారు డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబానికి చేయూతగా ఉంటున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలల్లో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేదలకు సహాయం చేసిన ఏకైక వ్యక్తి జగనన్న

- కూటమి ప్రభుత్వంలో పట్టించుకున్న వారే లేరు
- డాక్టర్ గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలియచేసిన ఎస్‌సీసెల్ కార్యదర్శి సురేష్‌కుమార్



డాక్టర్ గోపిరెడ్డిని సత్కరించిన సురేష్‌కుమార్

నరసరావుపేట: రాష్ట్రంలో పేదలకు సహాయం చేసిన ఏకైక ప్రభుత్వం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన పట్టణానికి చెందిన నేలటూరి సురేష్‌కుమార్ తన అనుయాయులతో సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈసందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పేదలను పట్టింటుకున్నవారెవరూ లేరని, వారికి వారు పంచుకొని తినటం తప్పితే వార్డుస్థాయిలో పేదలను పట్టించుకొని పాపాన పోలేదని అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అట్టర్‌ప్లాప్ అయ్యాయన్నారు.

సురేష్‌కుమార్ సేవలను గుర్తించి పార్టీ జిల్లా బాధ్యతలు అప్పగించిందన్నారు. అందరినీ కలుపుకుంటూ అన్నీ వర్గాలతో మమేకమై పేరు ప్రఖ్యాతలు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు అచ్చిశివకోటి, సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, సయ్యద్‌ఖాదర్‌బాష, గంటెనపాటి గాబ్రియేలు, కుక్కల పౌలు, తలారి బాలరాజు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు నెలకు రూ.30 వేలు ఇవ్వండి

పీజీఆర్‌ఎస్‌లో ప్రభుత్వానికి సూచించిన సీఐటీయూ నాయకులు



పీజీఆర్‌ఎస్‌లో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం (స్త్రీశక్తి) వలన నష్టపోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.30 వేలు ఇవ్వాలని, 2019 మోటార్ వాహన సవరణ చట్టం, బీఎన్ఎస్ఎస్ చట్టంలో ఉన్న హిట్ అండ్ రన్ సెక్షన్ 106/1, 106/2 రద్దు చేయాలని జిల్లా ఆటో, ట్రాలీ ఆటో, మినీ గూడ్స్ వెహికల్స్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పీజీఆర్‌ఎస్‌లో అర్జీ అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎం.హరిపోతురాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయడం వలన రాష్ట్రంలో ప్రజలను రవాణా చేసే ఆటో కార్మికులందరూ రోడ్డును పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికే ప్రైవేటు ఫైనాన్స్ వారి వలన పడుతున్న ఆర్థిక ఇబ్బందులు చాలక ప్రభుత్వం అమలుచేస్తున్న స్త్రీశక్తి పథకం వలన మూలిగే నక్క మీద తాటికాయపడినట్లు అయిందన్నారు. అందువలన ఆటో కార్మికులకి రూ.30వేలు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఇవే కాక జనరల్ ఇన్సూరెన్స్ భారాలు కూడా రవాణా రంగా కార్మికుల మీద అధికంగా విధిస్తున్నారన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ జిల్లా కార్యదర్శి షేక్ సిలార్‌మసూద్, షేక్ మస్తాన్‌వలి, సరికొండ వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

జాలాదిలో పత్తి పంటను దున్నేసిన బంధువులు



జాలాదిలో పత్తిపంటను దున్నిన ప్రాంతం

యడ్లపాడు: మండలంలోని జాలాది గ్రామానికి చెందిన రైతు కల్లూరి రామస్వామి సాగుచేసిన పత్తి పంటను సమీప బంధువులే ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. రామస్వామి ఫిర్యాదులో తెలిపిన ప్రకారం... వివిధ సర్వేనంబర్లలో ఉన్న తన మూడు ఎకరాల సాగుభూమిలో 65 రోజుల క్రితం వేసిన పత్తి పంటను రామస్వామి సాగు చేశాడు. ఈ నెల 7న సమీప బంధువులైన కల్లూరి సాంబయ్య, ఆయన కుమారుడు వీరాంజనేయులు అన్యాయంగా ట్రాక్టర్‌ను తీసుకువచ్చి సదరు పంటను దున్నేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ధ్వంసమైన పంటను క్షేత్రస్థాయిలో తగు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వినతిలో పేర్కొన్నారు. ఆయా వివరాలతో కూడిన ఫిర్యాదుల్ని సోమవారం యడ్లపాడు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎస్ఐ టి.శివరామకృష్ణకు అందించినట్లు తెలిపారు. పచ్చని పైరును ధ్వంసం చేయడానికి గల కారణాలు అధికారుల విచారణలో తెలియాల్సి ఉంది.

బీజేపీ సేవా పక్షోత్సవాలను జయప్రదం చేయండి

నరసరావుపేట: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ రెండోతేదీ గాంధీ జయంతి వరకు నిర్వహించే 'సేవా పక్షోత్సవాలు' విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కార్యాలయంలో సేవా పక్ష కార్యక్రమాల గురించి నాయకులు, కార్యకర్తలకు వివరించారు. అనంతరం కార్యాలయం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి జయహో మోదీ అనే నినాదాల మధ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర కార్యదర్శి, సేవా పక్వాడ్ కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జి మేకల హనుమంతరావు యాదవ్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, జిల్లా పార్టీ ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, సేవా పక్వాడ్ పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు కట్టా సుబ్బారావు, మైలవరపు సుబ్బారావు, గోకినేని వెంకటరమణ, మండల కన్వీనర్లు, కో–కన్వీనర్లు, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వినుకొండ : పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న నాగేంద్రస్వామి గుడి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



నాదెండ్ల: మండలంలోని కనపర్రు బీపీఆర్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వై.రాజ్యలక్ష్మిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జవహర్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి ఎక్కడ పనిచేసినా ఆయా పాఠశాలల బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. ఉపాధ్యాయులు యశోద, శంకరయ్య, గురునాధం పాల్గొన్నారు.

పొగ అందరికీ హాని కల్గిస్తుంది

రొంపిచర్ల: పొగ తాగిన వ్యక్తికే కాక చుట్టుపక్కల వారికి ఆరోగ్యానికి హానీ తలపెడుతుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవినాయక్ అన్నారు. మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో పొగాకు ఉత్పత్తులు వాడకానికి వ్యతిరేకంగా మోడల్ స్కూల్ స్కాడ్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొగ తాగడం వల్ల ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్ లాంటి వ్యాధుల బారిన పడతారన్నారు. బాల, బాలికలను, యువతరాన్ని పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా రక్షించుకోవాలన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. నిరక్షరాస్యులకు సైతం పొగాకు పట్ల అవగాహన కల్పించారు. మోడల్ స్కూల్ నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

యూరియా కోసం రైతుల నిరసనలు

ఈపూరు సొసైటీ కార్యాలయం ఎదుట నినాదాలు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఈపూరు మండలం సొసైటీ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు నిరసన చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు ఈనెల 6న తేదీన 440 యూరియా సంచులు సొసైటీ కార్యాలయానికి వచ్చాయి. అదేరోజు కొందరు రైతులకు యూరియా సంచులు వచ్చాయని తెలియటంతో సొసైటీ కార్యాలయానికి చేరుకుని యూరియా కోసం నిరీక్షణ చేశారు. సోమవారం మరలా 440 సంచులు మరలా లోడు రావటంతో రైతులు తెలుసుకొని సొసైటీ కార్యాలయానికి ఉదయం చేరుకున్నారు. ఈక్రమంలో సొసైటీ వారు ఉన్నతాధికారుల నుంచి పంపిణీ చేయటానికి అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. దీంతో గత్యంతరం లేని రైతులు నిరసనకు దిగారు. ఈవిషయం సోషల్ మీడియాలో హల్‌చల్ జరగటంతో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావటంతో హుటాహుటిన సొసైటీ అధికారులు స్పందించి క్యూలో లేని రైతుకు రెండు సంచుల వరకు యూరియా పంపిణీ చేశారు. అయితే ఇది ఇలాగా ఉంటే క్యూలో నిలుచున్న రైతులను కూర్చోబెట్టి యూరియా ఇవ్వటం లేదని నిరసన చేయటం హాస్యాస్పదంగా ఉందని అధికారులు అంటున్నారు. రైతులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని సోషల్ మీడియాలో రావటం పట్ల ప్రభుత్వ తీరుకు నిదర్శమని కొందరు రైతులు భావిస్తున్నారు.

సొసైటీ కార్యాలయానికి రైతులు రాగానే యూరియా సంచులు ఇస్తే ఇంత రాద్ధాంతం ఎందుకు చేస్తామని గుసగుసలాడుతున్నారు. ఒక వైపు సాగులో ఉన్న వరి పంటకు యూరియా సకాలంలో చల్లకపోతే దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు నిరసన చేస్తున్న రైతులను యూరియా కోసం రాద్ధాంతం చేయటం పట్ల పార్టీల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని నాయకులు విమర్శలు చేస్తున్నారు. నిరసన ధాటికి ఎట్టకేలకు అధికారులు యూరియా ఇవ్వటంతో రైతులు నిరసన విరమింపచేశారు.

యూరియా కొరత నివారించండి

మండల సీపీఐ అధ్యక్షులు ఆర్.వందనం



తహసీల్దారు అర్జున్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శావల్యాపురం: ఖరీఫ్ సీజను ప్రారంభమైనా యూరియా కరువైందని సీపీఐ మండల అధ్యక్షులు ఆర్.వందనం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ పార్టీ నాయకులు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఖరీఫ్ సీజను ప్రారంభమైందని పంటలకు సంబంధించిన ఎరువులు రైతులకు కొరత లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా యూరియా కొరత ఉండటంతో ప్రవేటు ఎరువుల దుకాణాంలో అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయన్నారు. ఒక యూరియా సంచి రూ.300 నుంచి 400 వరకు బ్లాక్ మార్కెట్‌లో రైతులకు విక్రయించటం పట్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. అధికారులు స్పందించి యూరియాను సకాలంలో రైతులకు సరఫరా అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ పార్టీ మండల అధ్యక్షులు వందనం కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నేతలు కె.మల్లిఖార్జునరావు, మరియబాబు, సాంబయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 65 టన్నుల యూరియా

బొల్లాపల్లి: మండలంలో 65 టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేక అధికారి, వినుకొండ ఏడీఏ సి.హెచ్.రవికుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం లోని రైతు సేవా కేంద్రంలో యూరియా లభ్యత, వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండల రైతాంగానికి ఇప్పటికి 200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని చెప్పారు అవసరమైన మేరకు ప్రతి రైతుకు రైతు సేవ కేంద్రం ద్వారా యూరియా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు పైపాటుగా నానో యూరియా పిచికారీ చేస్తే అద్భుతమైన ఫలితం ఉంటుందని సూచించారు. అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ ఎం సుధాకర్, ఎంపీడీవో పి.మాధురి ఎస్సై ఏ బాలకృష్ణ, ఏవో ఏ అంకారావు రైతులు డీలర్లు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందుబాటులో ఉంచరూ...

బొల్లాపల్లి : కాలంలో రైతులకు ఎరువులు అందుబాటులోకి ఉంచాలని సీపీఐ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏవీ సుధాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మండలంలో వరి, మిరప, పంటలు సాగుకు రైతుల సన్నద్ధమయ్యారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో షేక్ సైదా వలి నారాయణరెడ్డి రామకోటయ్య షేక్ జాన్ సాహెబ్ తదితరులు ఉన్నారు.

రెండు చోట్ల యూరియా అందుబాటులో...

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో మెయిన్ బజారులో సోమవారం వివిధ శాఖల ఆధ్వర్యంలో యూరియ పంపిణీపై రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ. హరిప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేపట్టిన రైతులకు అవసరమైన యూరియా మండలంలో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం యడ్లపాడు రైతు సేవా కేంద్రం పరిధిలో 14 మెట్రిక్ టన్నులు, అలాగే తుర్లపాడు పరిధిలో 7 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ ఎస్ అనురాధ, ఎంపీడీవో వి.హేమలతాదేవి, వీఆర్వో షేక్ అబ్దుల్లాబాష, షేక్ రఫీవుల్లా, యడ్లపాడు పంచాయతీ కార్యదర్శి ఎ.శశికళ వ్యవసాయ సహాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.